క్లుప్తంగా

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



గోపాల్‌పేట: కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం రైస్ మిల్లులకు తరలించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం వారు మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించారు. గోపాల్‌పేటలో దాదాపు ఇరవై రోజులుగా కొనుగోళ్లు సరిగా చేయడం లేదని, వెంటనే కొనుగోలు చేసి ధాన్యం రైస్‌మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఇటీవల తడిసిన ధాన్యం మొలకలు ఎత్తుతున్నాయని, వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు శ్రీనివాసులు, మాజీ వైఎస్ ఎంపీపీ చంద్రశేఖర్, మన్యంనాయక్ పాల్గొన్నారు.

గోదాం వద్ద అదనపు సిబ్బందిని నియమించండి



వీపనగండ్ల: మండల కేంద్రంలో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల వ్యవసాయ మార్కెట్ గోదామును ఇటీవల అధికారులు ప్రారంభించగా, ధాన్యాన్ని దించుకునేందుకు సరైన సిబ్బంది లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం గోదాం దగ్గరకు వెళ్లే రహదారిలో లారీ దిగబడడంతో పదుల సంఖ్యలో ధాన్యం తీసుకువచ్చిన వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారి నుంచి గోదాముకు వెళ్లే దారిని సీసీ రోడ్డుగా మారిస్తే ఇబ్బందులు తీరుతాయని పలువురు రైతులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారితో పాటు అవసరమైన మేరకు హమాలీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'అపూర్వ' సమ్మేళనం



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో 2007–08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపుగా 17 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు మంజుల, జ్యోతి, కవిత, అయ్యపురెడ్డి, ధర్మారెడ్డి, ప్రసాద్‌రావు, మోగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్థ్యానికి మించి.. లారీల్లో తరలించి



పాన్‌గల్: వరి ధాన్యం సేకరణ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో తూకం వేసిన ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా ఆయా కేంద్రాల నిర్వహకులు లారీల్లో గోదాంకు, వారికి కేటాయించిన మిల్లులకు తరలిస్తున్నారు. అయితే లారీల సామర్థ్యానికి మించి బస్తాలు వేయడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. గోదాంకు, మిల్లులకు తరలించే క్రమంలో కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో అవి తాకి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ధాన్యం తరలించే వారు లారీల్లో బస్తాలను సామర్థ్యానికి మించి తరలించొద్దని పలువురు కోరుతున్నారు.

అంధకారంలో కాలనీలు

అమరచింత: మున్సిపాలిటీలోని ఆయా కాలనీలలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఎల్ఈడీ బల్బులు కొన్ని రోజులుగా వెలగక పోవడంతో కాలనీ రహదారులు అంధకారంలో మగ్గుతున్నాయి. వీధి దీపాల ఏర్పాటు కోసం టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ వాటి నిర్వహణ కోసం సూపర్ వైజర్‌ను నియమించడం జరిగిందే తప్పా పాడైన బల్బుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. మున్సిపాలిటీలో ఎలక్ట్రీషన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి సూచించిన విధంగా బల్బులు సరఫరా చేయలేక పోవడంతో ఇలాంటి పరిస్థితి దాపరించిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితం!

- అప్పారెడ్డిపల్లి – ఆముదంబండతండా బీటీ రోడ్డుకు రూ.4.70 కోట్లు మంజూరు
- నాలుగేళ్లు గడిచినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బీటీకి నోచుకోని పర్వతాపురం రోడ్డు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం పీఎంజీఎస్‌వై నిధులు మంజూరు చేసిన నాలుగేళ్లు దాటినా టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. దీంతో పలు గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సంబంధిత కాంట్రాక్టర్‌తో వెంటనే పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.4.70 కోట్ల నిధులు మంజూరు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రజల కోరిక మేరకు నాటి పాలకులు ప్రత్యేక చొరవతో అధికారులతో సర్వే చేయించి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం 2021 లో పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రూ.4.70 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండరు ప్రక్రియ పూర్తి అయిన తరువాత కాంట్రాక్టర్ నేటికీ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేలా ఉన్నత స్థాయి అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి



అప్పారెడ్డిపల్లిలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

రెండు గ్రామాలు, నాలుగు తండాలకు మేలు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండా వరకు 7.3 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణంతో పాటుగా మార్గమధ్యలో పర్వతాపురం శివారులో ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. నాటి వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి పనులకు 2021 జూలై 8న శంకుస్థాపన చేశారు. కాని కాంట్రాక్టర్ మాత్రం నాలుగేళ్లు దాటిన ఇప్పటికీ పనులు చేపట్టలేదు. ఈ రోడ్డు పనులు పూర్తయితే అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, షాపురం ఊరంచు తండా, ఆముదంబండ తండా, కోతులకుంట తండా, కర్నెతండాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనులు జరిగేలా చూడాలని ఆయా గ్రామాలు, తండాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ భాస్కర్ ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి..



అప్పారెడ్డిపల్లి నుంచి మా ఊరు మీదుగా ఆముదంబండ తండా వరకు బీటీ నిర్మాణానికి ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. మధ్యలో మా గ్రామం దగ్గర కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తున్నట్లు చెట్లు కొన్ని తొలిగించి వదిలేశాడు. ఇప్పటికీ పనులు చేయడం లేదు రోడ్డు పనులు పూర్తి చేస్తే గ్రామాలు, తండాల ప్రజలకు మేలు జరుగుతుంది.

– గోవర్ధన్‌రెడ్డి, పర్వతాపురం

అభయాంజనేయస్వామికి అభిషేకం

- వైభవంగా మూడో వార్షికోత్సవం
- స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మదనాపురంలో ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం

మదనాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే మదనాపురం అభయాంజనేయ స్వామి మూడో వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, గోపాలకృష్ణ గురు స్వామి, రవికాంత్ జోషి స్వామి ఆధ్వర్యంలో స్వామివారి భారి విగ్రహానికి, క్షీరాభిషేకం, జలాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ రజితశెట్టి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గంప జాతర



పెద్దగూడెంలో గంపలతో మహిళల ఊరేగింపు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెంలో ఘనంగా గ్రామ ప్రజలు ఆదివారం గంప జాతర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు గంపలను ప్రత్యేకంగా రంగులతో అలకంకరించి, చాట, చీపురు, మస్తి దుస్తులు గంపలో పెట్టుకొని గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామ శివారులో దేవత గుడి దగ్గర నైవేద్యాలు తయారు చేసి, పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గంప జాత రతో గ్రామంలోని అరిష్టాలు తొలగిపోతాయని ప్రజల నమ్మకమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఉద్యమాలను బలోపేతం చేయాలి



నూతన కమిటీ సభ్యులతో ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్

అమరచింత: వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో పంటలు వేసుకునే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, రైతాంగ ఉద్యమాలను బలోపేతం చేయడానికి రైతులు సంఘటితంగా ఉండాలని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఏఐకేఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, పరికరాలు ఇవ్వాలని, కొనుగోలు చేసిన వడ్లకు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తూ బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నేలకొరిగిన మామిడి తోట రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు సైతం ప్రభుత్వం ఆదుకోవాలని, పెట్టుబడి సాయం అందించాలన్నారు. అనంతరం ఏఐకేఎస్ నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో మోహన్, శంకర్, నాగరాజు, రాజు, మహేష్, అనంతి పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి అన్నదాతల గోస పట్టదా'



ఉప్పరిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు పరిశీలిస్తున్న కృష్ణానాయక్

ఖిల్లాఘనపురం: ప్రభుత్వానికి, పాలకులకు అన్నదాతలు పడుతున్న హరిగోస కనిపించడం లేదా? అని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పరిపల్లి, సూరాయపల్లి, జగ్గాయపల్లి తదితర గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ఆదుకుంటామని, బీఆర్‌ఎస్ కంటే ఎక్కువగా పథకాలు తీసుకొస్తామని గొప్పలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోసి రెండు నెలలైనా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ఏ గ్రామానికి వెళ్లినా రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, కేంద్రాల నిర్వహకులతో ముందుగానే సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకునేవారన్నారు. రైతులు రెండు నెలలుగా ఎండకు, వర్షాని గోస పడుతుంటే ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మండలంలోని ఉప్పరిపల్లి, సూరాయపల్లి, జగ్గాయపల్లి, మానాజీపేట, గట్టుకాడిపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో 10 నుంచి 15 వేల బస్తాలు ఇంకా కల్లాల్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మన్యంగౌడు, పీనానాయక్, నార్యనాయక్ ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం



అమరచింత: ఇచ్చిన హామీల ప్రకారం రోడ్డు అభి వృద్ధి పనులను చేపట్టలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభు త్వం ఉందని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య అన్నారు. మండలంలోని కిష్టంపల్లిలో ఆదివారం మాన్ కిబాత్ కార్యక్రమం అనంతరం మిట్టనంది మళ్ల, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లె, చంద్రఘడ్ నుంచి నందిమల్ల, ధర్మాపురం రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లకు నిధులు ఇచ్చామని, పనులు చేపడుతున్నామని నా యకులు ప్రకటనలు ఇస్తున్నారు తప్పా రోడ్డు పను లు జరగడం లేదన్నారు. అతుకుల రోడ్లపై ప్రయా ణం భారంగా ఉందని, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రహదారి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో భారీ వర్షం



కొల్లాపూర్: పట్టణంలోని ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంట పాటు వర్షం పడింది. రోజంతా చల్లటి గాలులు వీచాయి. వర్షం కారణంగా కాలనీల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయి. వర్షంతో పాటు ఈదురుగాలులు కూడా వీచడంతో మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆదివాసీలు అన్నిరంగాల్లో రాణించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

లింగాల: ఆదివాసీలు అన్ని రంగాలలో రాణించాలని ఎస్‌ఐ వెంకటేష్‌గౌడు కోరారు. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న అప్పాపూర్‌పెంట, బౌరాపురం, రాంపూర్‌పెంట, పుల్లాయిపల్లి పెంటలో ఆదివారం ఎస్‌ఐతో పాటు పోలీసు సిబ్బంది పర్యటించి ఆదివాసీయులైన చెంచులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వం ఆదివాసీలకు విద్యా పరంగా ఎన్నో రకాలుగా కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దన్నారు. చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని, జీవనోపాధికి ప్రభుత్వం కల్పిస్తున్న వనరులు, ఇతర సౌకర్యాలను ఉపయోగించుకొని ఎదగాలన్నారు. కార్యక్రమంలో చెంచులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

27న ముదిరాజ్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



సమావేశానికి హాజరైన ముదిరాజ్ యూనియన్ సభ్యులు

నారాయణపేట ఎడ్యుకేషన్: ముదిరాజ్ విద్యార్థులందరూ విద్యా పరంగా ముందుకెళ్లాలని నారాయణపేట జిల్లా ముదిరాజ్ అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, పట్టణ అధ్యక్షుడు బాపన్‌పల్లి వెంకటయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక విజయ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని స్థానిక అభినందన గార్డెన్‌లో ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాలలో 500లకు పైగా మార్కులు సంపాదించిన ముదిరాజ్ విద్యార్థులకు మెమెంటో, ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. అదే విధంగా ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో 400లకు పైగా మార్కులు సంపాదించిన వారికి, ద్వితీయ సంవత్సర ఫలితాలలో 900 పైగా మార్కులు పొందిన వారికి మెమెంటో పాటు ప్రశంశ పత్రం అందజేస్తామన్నారు. కావునా ఈ అవకాశాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న అందరూ ముదిరాజ్ విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, ఆర్‌టీఓ డైరెక్టర్ పోషల్ రాజేష్, బాల్‌రాజ్, శేషప్ప, జనార్ధన్, రఘు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఇంటిపైన వేలాడుతున్న విద్యుత్ తీగలు

బిజినేపల్లి: మండలంలోని మమ్మాయిపల్లిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇళ్లపైనుంచే విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటి పైకి వెళ్లేందుకు యజమానులు వెనకడుగు వేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల కిందట స్తంభాలను ఏర్పాటు చేశారని ఇవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని వాపోయారు. సంబంధిత అధికారుల స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని, కొత్తంగా స్తంభాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎత్తిపోతల పథకం కమిటీ ఎన్నిక

అలంపూర్: ఎత్తిపోతల పథకం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని రైతు సంఘం వద్ద జోగుళాంబ దేవి ఎత్తిపోతల పథకం నూతన కమిటీ ఎన్నిక సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బ్రహ్మేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రజినిబాబు, సహాయ కార్యదర్శిగా పెద్దబాబు, కోశాధికారిగా విశ్వనాథం, సభ్యులుగా చెంచయ్య, జయన్న, హరినాథ్‌రెడ్డి, రమేష్, న్యాయ సలహాదారుగా నాగరాజుయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, జితేంద్‌గౌడు, రేపల్లె దేవదాసు, శేఖర్‌రెడ్డి, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు మాయం



కోడేరు ఊరగుట్ట వద్ద మట్టిని తవ్వుతున్న హిటాచీ

- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

కోడేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమార్కులు గుట్టలను తవ్వి మట్టిని విక్రయిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు రాజాపూర్, బావాయిపల్లి తదితర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా గుట్టలను తవ్వి మట్టిని అక్రమంగా తరలించుకుపోవడంతో పాటు పచ్చని వృక్ష సంపద కూడా నేలకొరుగుతుంది. ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడేందుకు రూ.లక్షలు వెచ్చించి గుట్టల్లో మొక్కలు నాటిస్తుంటే.. కొందరి స్వార్థానికి గుట్టలు తవ్వే క్రమంలో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. దీంతో వాతావరణ సమతుల్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఎర్రమట్టిని తవ్వి దళారులు సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో బడా నాయకుల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. కొంతకాలంగా ఆయా ప్రాంతాల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లతో రోడ్లు, ఇళ్ల నిర్మాణానికి, రియల్ ఎస్టేట్ లేఅవుట్లకు తదితర వాటికి ఎర్రమట్టిని తవ్వి విక్రయిస్తున్నారు. అదే విధంగా ఎంజీకేఎల్ఐ కాల్వకు ఇరువైపులా ఉన్న మట్టిని సైతం కొంత మంది వ్యాపారులు మట్టిని తవ్వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు జరుగుతుండటంతో రోడ్లన్ని గుంతల మయంగా మారుతున్నాయని, పెద్ద పెద్ద రాళ్లు సహితం వాహనాల నుంచి కింద పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు పాతర

అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నిబంధనల ప్రకారం అయితే అధికారుల నుంచి అనుమతులు తీసుకొని మాత్రమే మట్టిని తరలించాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుడా ఇష్టానుసరంగా మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రాత్రి వేళలో మట్టి తరలిస్తున్న టిప్పర్ (ఫైల్)

అధికారులు పట్టించుకోవడం లేదు



మండలంలో ఎర్రమట్టిని రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నా రు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడు తుంది. అక్రమంగా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడుతాం.

– లింగన్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు

కఠిన చర్యలు తీసుకుంటాం



మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా ఎర్ర మట్టి తరలిస్తే అటు వంటి వారిపై కఠిన చ ర్యలు తీసుకుంటాం. ఇటీవల అనుమతులు లే కుండా ఇటాచీతో తవ్వి టిప్పర్ల ద్వారా ఎర్రమ ట్టిని తరలిస్తుండగా వాటిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాం .మట్టిని తరలించేందు కు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్, తహసీల్దార్